క్లుప్తంగా

క్రోసూరు ఎంపీడీవోగా పీకే రమణ

క్రోసూరు: ఎంపీడీవోగా పీకే రమణ నియమితులయ్యారని గురువారం ఈఓపీఆర్డీ పి.శివరామయ్య గురువారం తెలిపారు. కృష్ణాజిల్లా మండవల్లి మండలం నుంచి ఇక్కడకు ఎన్నికల బదిలీపై వస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం విధుల్లో చేరుతారని పేర్కొన్నారు.

గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లి..



పీసపాడు(క్రోసూరు): పీసపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ అక్కమ్మ హృద్రోగ సమస్యతో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. గ్రామ వలంటీర్ బషీరున్నీసా వృద్ధురాలికి పింఛన్ నగదు అత్యవసరమని తెలుసుకుంది. ఆసుపత్రికి వెళ్లి రూ.3వేలు పింఛను నగదు అందజేసింది. దీంతో వృద్ధురాలు సంతోషం వ్యక్తం చేసింది.

అమరావతి ఎంపీడీఓగా జి.రాణి బాధ్యతల స్వీకారం



అమరావతి: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నూతనంగా నియమితులైన జి.రాణి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న ఉమాదేవి గత నెలలో బదిలీ అయ్యారు. ఇన్‌చార్జిగా ఈఓపీఆర్డీ కె.గంగాధర శ్రీనివాస్ ఉన్నారు. కృష్ణాజిల్లా ముసునూరు ఎంపీడీఓగా జి.రాణి గతంలో పనిచేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె ఈ సందర్భంగా తెలిపారు.

సత్తెనపల్లి ఎంపీడీఓ బాధ్యతల స్వీకారం



సత్తెనపల్లి: ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు అందరి సహకారంతో సత్తెనపల్లి మండల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీడీవో ఎన్.జగదీష్ అన్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా అర్ధవీడు నుంచి ఆయన బదిలీపై సత్తెనపల్లి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవో గా పని చేసిన జీవి సత్యనారాయణ ప్రకాశం జిల్లా అద్దంకి బదిలీ అయ్యారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శిగా శివారెడ్డి



రాజుపాలెం: రాజుపాలెం వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శిగా కె.శివారెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు మిర్చి యార్డులో కార్యదర్శిగా పని చేస్తున్న శివారెడ్డి బదిలీపై రాజుపాలెం మార్కెట్ యార్డుకు వచ్చారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ యార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ అద్దెబస్సు

యడ్లపాడు: ఆర్టీసీ అద్దెబస్సు లారీని ఢీకొనడంతో పెనుప్రమా దం తప్పింది. నెల్లూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విజయవా డ నుంచి నెల్లూరుకు ప్రయాణికులతో బయలు దేరి యడ్లపాడు గ్రామం ఎస్ఎస్ఎల్ మిల్లు సమీపంలో ముందు వెళ్తున్న పీవీసీ పైపుల లోడు లారీని ఢీకొంది. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో లారీ వెనుకభాగం, బస్సు ముందుభాగం భారీగా ధ్వంసమయ్యా యి. బస్సు డ్రైవర్ క్యాబిన్‌లోనే ఇరుక్కోవడంతో కాళ్లకు గాయాలయ్యాయి. బస్సులో 19 మంది ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. స్వల్పంగా గాయలవ్వడంతో అందరూ దిగి ఇతర బస్సుల్లో వెళ్లిపోయారు. డ్రైవర్‌ను చిలకలూరిపేట ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాతులూరులో ఘనంగా ఘటం ఊరేగింపు



నాదెండ్ల: సాతులూరులో గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదవ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రెండో రోజు ఘటం (కుండ) ఊరేగింపు నిర్వహించారు. గ్రామస్తులు ఘటం కుండతో సాంప్రదాయబద్ధ మేళతాళాలతో ఉదయం 6–9 గంటల వరకు గ్రామోత్సవంతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం సద్దిని సమర్పించారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

పింఛను పండగ



వృద్ధురాలికి బయోమెట్రిక్ వేసి, పింఛను ఇస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది

సత్తెనపల్లి డివిజన్‌లో 81,361 మంది పింఛనుదారులు

సత్తెనపల్లి: వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛను కోసం నిరీక్షించే రోజులు పోయి..వారి సంరక్షణే లక్ష్యంగా వలంటీర్లు ఇంటింటికీ వచ్చి నగదు ఇస్తున్న రోజు వచ్చాయి. ప్రతి నెలా 1వ తేదీని పింఛను పండుగ చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. వైఎస్సార్ పింఛను కానుక లబ్ధికి దరఖాస్తు చేసుకున్న అర్హులకు వెంటనే లబ్ధి చేకూరుతోంది. వలంటీర్లే ఇంటికి వచ్చి..పింఛను నగదు వస్తుందా.. లేదా.. అని కారణాలు తెలుసుకుని రాకుంటే స్వయంగా వారే దరఖాస్తు చేయించి మంజూరు చేయిస్తుంటే లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోతున్నాయి. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో 81,361 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారు. ఫిబ్రవరి నెలా వీరికి రూ.24,26,10,500లు పింఛను నగదు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందిస్తున్నారు. డివిజన్‌లో గురువారం ఒక్క రోజు అత్యధికంగా సత్తెనపల్లి టౌన్‌లో 76.94 శాతం పంపిణీ పింఛన్లు పంపిణీ చేశారు.



వైద్యశాలలో రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్

డివిజన్‌లో మండలాల వారీగా ఫిబ్రవరి పింఛన్ పంపిణీ ఇలా..

మండలం	పింఛనుదారులు	పింఛను నగదు	పంపిణీ శాతం
సత్తెనపల్లిటౌన్	6,422	1,92,61,500	76.94
సత్తెనపల్లిరూరల్	11,079	3,29,15,500	56.78
ముప్పాళ్ళ	6,336	1,87,28,000	57.29
రాజుపాలెం	7,146	2,13,67,000	60.5
నకరికల్లు	9,782	2,90,58,500	60.45
పెదకూరపాడు	7,946	2,37,87,000	55.6
అమరావతి	10,302	3,07,70,000	58.42
అచ్చంపేట	9,083	2,70,77,500	54.91
క్రోసూరు	8,920	2,66,18,000	49.32
బెల్లంకొండ	4,345	1,30,27,500	62.34

పింఛన్ ఇచ్చి ఆదుకున్నారు



నా భర్త చనిపోవడంతో ఆధారం కోల్పోయాను. వలంటీర్ ఇంటికి వచ్చి సంతకం చేయించుకుని పింఛనుకు దరఖాస్తు చేయించారు. గతేడాది జూలై నుంచి కొత్తగా పింఛన్ మంజూరు అయిందని.. ఇంటికొచ్చి డబ్బు ఇచ్చారు. పింఛన్‌తో ఆదుకున్న ముఖ్యమంత్రి జగన్ మేలు ఎప్పటికీ మరువలేను.

– స్వయం పాకుల పద్మ, వితంతు, సత్తెనపల్లి.

రుణపడి ఉంటాం



నాకు కాళ్లు, చేతులు పని చేయవు. దివ్యాంగ పింఛను కోసం గత ప్రభుత్వంలో ప్రయత్నించాను. కానీ పట్టించుకున్న వారు లేరు. గతేడాది సదరం సర్టిఫికెట్ తీసుకున్నా. సర్టిఫికెట్ వచ్చాక వలంటీర్ పింఛన్ కోసం దరఖాస్తు చేయించారు. గతేడాది మే నెల నుంచి కొత్త పింఛన్ మంజూరు అయ్యిందని, ఇంటికి వచ్చి నగదు ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను.

– షేక్ మీర్ సా, దివ్యాంగుడు, సత్తెనపల్లి.

రేపు సచివాలయం, ఆర్బీకే భవనాలు ప్రారంభం



రైతు భరోసాకేంద్రం



వెల్‌నెస్ సెంటర్

నార్నెపాడు(ముప్పాళ్ళ): నార్నెపాడు గ్రామంలో ఈ నెల 3న పలు అభివృద్ధి పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రారంభించనున్నారు. రూ.40లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.21.80లక్షలతో ఆర్బీకే భవనం, రూ.20.8లక్షలతో హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ భవనాలను ఆయన ప్రారంభించనున్నారు. సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నక్కా శ్రీనివాసరావు తెలిపారు.

సత్తెనపల్లి డీఎస్పీగా గురునాథ్‌బాబు

సత్తెనపల్లి: సత్తెనపల్లి డీఎస్పీగా తూర్పుగోదావరి జిల్లా క్రైమ్స్ ఆర్‌జేవీఎంగా విధులు నిర్వహిస్తున్న జీసీ గురునాథ్‌బాబును నియమించారు. ఇక్కడ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న బి.ఆదినారాయణ సాధారణ తూర్పుగోదావరి జిల్లా దిశ డీఎస్పీగా బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయన విధుల నుంచి రిలీవ్ కానున్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి సబ్ డివిజన్‌లో డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన బి.ఆదినారాయణ సమర్థవంతంగా శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేశారు. 1991లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పోలీస్ శాఖలో చేరిన ఆయన 2004లో గుంటూరు లాలాపేట ఎస్ఐగా ఉన్న సమయంలో ఆయన ప్రధానమంత్రి మెడల్‌ను అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. 2016లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా, 2020లో డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల, మాచర్లలో విధులు నిర్వహించారు. సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు. 2020లో డీఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. 2022 డిసెంబర్ 9న సత్తెనపల్లి డీఎస్పీగా బదిలీ పై వచ్చారు.

రూరల్ సీఐగా రాంబాబు

సత్తెనపల్లి: సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా పొన్నూరు సీఐ మీసాల రాంబాబును నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన సత్తెనపల్లి రూరల్‌కు రానున్నారు. అలాగే సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ అప్ గ్రేడ్ కావడంతో ఎస్‌హెచ్‌ఓగా ప్రకాశం జిల్లా కుంభం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఎం.రాజేష్ కుమార్‌ను నియమించారు.

పురుగు మందు దుకాణాల్లో తనిఖీలు

రూ.6.61లక్షల విలువైన పురుగు మందు విక్రయాల నిలుపుదల



పెదపాలెంలో పురుగు మందు దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో వెంకటేశ్వర్లు

అచ్చంపేట: వ్యవసాయశాఖ అనుమతులతోనే పెస్టిసైడ్స్ మందులు విక్రయించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయాధికారి బి.వెంకటేశ్వర్లు పెస్టిసైడ్స్ దుకాణదారులను హెచ్చరించారు. పెదపాలెం, మిట్టపాలెం గ్రామాల్లో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. మిట్టపాలెంలో ఏ విధమైన అనుమతి పత్రాలు లేని రూ.4,47,499ల విలువ గల 219 లీటర్ల పురుగు మందు విక్రయాలను నిలిపివేశారు. పెదపాలెంలో శ్రీ లక్ష్మీనరసింహా ఫెర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో రూ.2,14,500ల విలువగల 58 లీటర్ల పురుగు మందు అమ్మకాలను నిలిపి వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగానే అన్ని దుకాణాలను సందర్శించడం జరిగిందన్నారు. దుకాణాదారులు తప్పనిసరిగా అమ్మకపు రిజిష్టర్లను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరించుకుంటూ ఉండాలన్నారు. స్టాక్ బోర్డులు, ధరల పట్టికలను ప్రతి షాపూలోనూ ఉంచాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించడం నేరమన్నారు. రైతులకు విక్రయించి ప్రతి పెస్టిసైడ్స్‌కి తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు.

ఆశాజనకంగా శనగ సాగు



నరుకుళ్లపాడులో శనగ పంట

అమరావతి: శనగపంట రైతులకు ఆశాజనకంగా ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం వచ్చే అవకాశమున్న శనగ పంటను రైతులు ఈ ఏడాది కాస్త ఎక్కువగానే సాగు చేశారు. పంట ఏపుగా పెరుగుతున్న సమయంలో వారం పాటు నిరవధికంగా వర్షాలు కురవడంతో.. మండల పరిధి గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో శనగ పంట కుళ్లిపోయి చేతికందకుండా పోయింది. దీంతో ప్రభుత్వం 80శాతం సబ్సిడీతో ఎకరాకు 40కేజీల చొప్పున విత్తనాలను రైతులకు పంపిణీ చేసింది. రైతులు మరలా సాగు చేస్తున్నారు. మండలంలో నరుకుళ్ళపాడు, ఎండ్రాయి, చావపాడు, పెదమద్దూరు, వైకుంఠపురం, ధరణికోట, ఉంగుటూరు తదితర గ్రామాల్లో శనగ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. నీటి వసతి పెద్దగా లేకపోయినా బెట్ట వాతావరణంలో ఉదయం కురిసే మంచుకు ఏపుగా పెరిగుతుండటంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ పైరు కాయదశలో ఉంది. ఈ సందర్భంగా గురువారం మండల వ్యవసాయాధికారి ఎస్కె ఆహ్మద్ నరుకుళ్లపాడు ఎండ్రాయిలలో శనగ పంటను పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. శనగ పంటలో కేళీలను, తెగుళ్లు, పురుగు ఆశించిన మొక్కలను తీసివేయాలన్నారు. దీని వల్ల విత్తన స్వచ్ఛత శాతం పెరుగుతుందన్నారు. అలాగే పంట కోసేటప్పుడు చుట్టు మూడు మీటర్లు వదలి మిగిలిన పంటను విత్తనం కొరకు తీసుకుని, చుట్టూ వదలిన పైరును ఆహార ఉత్పత్తులకు వాడుకోవాలని సూచించారు.

18 రకాల చేతివృత్తుల వారికి ప్రయోజనం

పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించిన విశ్వబ్రాహ్మణ సంఘం



కేఎల్ఎస్ రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

నరసరావుపేట: పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా 18 రకాల చేతివృత్తుల వారికి కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు నుంచి ఆర్థిక సహాయం లభిస్తుందని, వినియోగించుకొని ప్రతి ఒక్కరు ఆర్థికంగా ఎదగాలని ఐఐడీయస్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.ఎల్.యస్.రెడ్డి అన్నారు. గురువారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవీ కల్యాణ మండపంలో ఎంఎస్ఎంఇ డెవలప్‌మెంట్ అండ్ ఫెసిలిటేషన్ సారథ్యంలో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి మొత్తం 200 మంది చేతివృత్తుల వారు పాల్గొని విశ్వకర్మ పథకం ప్రయోజనాలు తెలుసుకున్నారు. జిల్లా పంచాయతీ అధికారి ఎంవీ భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వి.వెంకటేశ్వరరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శ్రీనివాస రాంప్రసాద్, , ఏపీ ఎంఎస్ ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భీమవరం విజయలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవ్‌రావు, ఆర్టిసన్ సెల్ కన్వీనర్ హనుమయ్య, పల్నాడు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు సుతారం వాసు, ప్రధాన కార్యదర్శి బొప్పూడి సాయి ప్రసాద్, కోశాధి కారి వేములూరి రాంబాబు, కమిటీ సభ్యులు బంగారు బాబు పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ షాపులో విజిలెన్స్ తనిఖీలు

రూ.4.45 లక్షల విలువైన ఎరువుల విక్రయాలు నిలుపుదల



తనిఖీచేస్తున్న విజిలెన్స్, వ్యవసాయాధికారులు

నరసరావుపేట రూరల్: మండలంలోని కొండకావూరు గ్రామంలో గురువారం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు వ్యవసాయ సిబ్బందితో కలసి శ్రీరామకృష్ణ ఎంటర్ ప్రైజెస్ పెస్టిసైడ్స్ షాపులో తనిఖీలు చేశారు. వ్యవసాయ శాఖ వారి నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా, రికార్డు లు లేకుండా ఫెర్టి లైజర్స్ విక్రయిస్తున్నట్లు గమనించారు. గుంటూరు రీజినల్ ఎన్‌ఫోర్సుమెంట్ విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన దాడుల్లో రెండు కంపెనీలకు చెందిన ఎరువుల స్టాక్ లైసెన్స్‌లో లేనివిగా కనుగొన్నారు. షాపులోని రూ.4.45 లక్షల విలువైన 20 మెట్రిక్ టన్నుల ఫర్టిలైజర్ల అమ్మకాలను నిలుపుదల చేశారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణ కుమార్, సబ్‌ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో డిజిటల్ సేవలపై అవగాహన



విద్యార్థులతో ఉపాధ్యాయులు

అచ్చంపేట: గ్రామ సచివాలయాల్లో డిజిటలైజేషన్ ద్వారా త్వరితగతిన అందుతున్న సేవలను గురువారం స్థానిక గురుకుల పాఠశాల, కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు కట్టా శివన్నారాయణ వారికి సచివాలయ వ్యవస్థ ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయో వివరించారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీని పరిశీలించారు. వారి వెంట పాఠశాల ప్రిన్సిపల్ టి.అరుణ్‌కుమార్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎ.సుబ్బారావు ఉన్నారు.

ఉద్యోగోన్నతిపై తహసీల్దారు బదిలీ

అచ్చంపేట: తహసీల్దారు సీహెచ్ పద్మాదేవి ఉద్యోగన్నతిపై నెల్లూరు జిల్లాకు విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా బదిలీ అయ్యారు. తహసీల్దారు రెండేళ్లు ఆమె సేవలందించారు. నూతన తహసీల్దారు ప్రకాశం జిల్లా నుంచి రానున్నట్లు సమాచారం.

విద్యుత్ కష్టాలకు చెల్లు చీటీ



కొమెరపూడిలోని విద్యుత్ సబ్‌స్టేషన్




విద్యుత్ సబ్‌స్టేషన్ భవనం

- కొమెరపూడిలో రూ.3 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- నాలుగు గ్రామాల వినియోగదారులకు తొలగిన కష్టాలు

ఇదీ కదా.. అభివృద్ధి

సత్తెనపల్లి: దశాబ్దాల తరబడి గ్రామస్తులు ఎదుర్కొంటున్న విద్యుత్ వెతలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లి చీటీ ఇచ్చింది. మెరుగైన, నాణ్యమైన, నిరంతర విద్యుత్తు సరఫరా చేసేందుకు మండలంలోని కొమెరపూడి గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. గతేడాది డిసెంబరు 18న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సబ్ స్టేషన్‌ను ప్రారంభించారు. కొమెరపూడి గ్రామంతో పాటు లక్కరాజుగార్లపాడు, కంటెపూడి, కట్టావారిపాలెం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఈ గ్రామాలకు గతంలో మండలంలోని నందిగామ నుంచి విద్యుత్ సరఫరా జరిగేది. పొలాల మీదుగా ఏర్పాటు చేసిన లైన్‌ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేది. వర్షాలు, తుఫాన్లు, ఈదురు గాలుల సమయంలో లైన్లలో ఏర్పడే సాంకేతిక లోపాలతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీనికి తోడు లోవోల్టేజ్ సమస్య కూడా తీవ్రంగా ఉండేది. గత కాంగ్రెస్ హయాంలో సబ్‌స్టేషన్ మంజూరైనప్పటికీ స్థల సేకరణలో ఇబ్బందుల కారణంగా అప్పట్లో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయలేదు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం సబ్‌స్టేషన్ నిర్మాణ ఊసే ఎత్తలేదు. వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి ఈ సమస్యను మంత్రి అంబటి రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసింది. కొమెరపూడిలో 80 సెంట్ల స్థలాన్ని పంచాయతీ విద్యుత్ శాఖకు అప్పగించింది.

విద్యుత్తు సమస్యలు ఉండవు



కొమెరపూడి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల నాలుగు గ్రామాలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉండవు. నాణ్యమైన విద్యుత్తు సరఫరా జరుగుతుంది. గతంలో విద్యుత్ వినియోగదారులు పడిన కష్టాలకు ఇక చెక్ పెట్టినట్లే. లోవోల్టేజి సమస్య కూడా తొలగిపోయింది.

పొట్లూరి తిరుపతయ్య, విద్యుత్ శాఖ ఏఈ, సత్తెనపల్లి రూరల్.

రహదారికి మరమ్మతులు



వినుకొండ నుంచి గుంటూరు వరకు జాతీయ రహదారి మార్గంలో ప్యాచ్ వర్క్ పనులు చేస్తున్నట్లు డీఈ బండి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. మార్గంలో ఎక్కడా గుంతలు లేకుండా వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉండటానికి రూ. 3 కోట్ల వ్యయంతో రహదారి మార్గంలో ప్యాచ్ పనులు చేస్తున్నట్లు చెప్పారు. వినుకొండ నుంచి గుంటూరు వరకు 97 కిలోమీటర్ల మేర ఆధునికీకరణ యంత్ర పరికరాల సహాయంతో పనులు వేగవంతంగా చేస్తున్నట్లు డీఈ తెలిపారు. నాణ్యాత ప్రమాణాలు లోపించకుండా ఉండటానికి నిరంతరం అధికారుల పర్యవేక్షణలో పారదర్శకంగా పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఏఈ ప్రకాష్, ఇతర సిబ్బంది ఉన్నారు.

– శావల్యాపురం

నైతిక విలువలపై పరీక్షలు

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన బాలికల జూనియర్ కళాశాలలో రెండురోజుల పాటు పరిసరాల విజ్ఞానం, మానవతా నైతిక విలువలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి గురువారం తెలిపారు. ఈ పరీక్షలు నిర్వహణ వల్ల విద్యార్థుల్లో ఉన్న సామర్థ్యాలను దోహదపడతాయన్నారు. ప్రశ్న పత్రాలు కూడా ఆన్‌లైన్ వస్తాయని మార్కులు ఆధారంగా కొంతమేర ఫైనల్ పరీక్షల్లో కొన్ని మార్కులు కలుస్తాయన్నారు.